# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-04-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లోని ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టును పరిశీలించనున్న ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్.**

3. **అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అమరావతి నిర్మాణాన్ని 2028 నాటికి పూర్తి చేస్తామని వెల్లడించిన ఆంధ్రప్రదేశ్ మంత్రి పి.నారాయణ.**

4. **ప్రభుత్వ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా ఈ రోజు నుంచి గ్రామసభలు నిర్వహించనున్న రాష్ట్ర ప్రభుత్వం.**

5. **మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర అందేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్న వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు.**

==========================

ఆంధ్రప్రదేశ్ లోని వైయస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని నిన్న ఘనంగా నిర్వహించారు. కళ్యాణ మహత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కళ్యాణం అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత ఒంటిమిట్టలోని కోదండరాముని ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిందని గుర్తుచేశారు. ఈ పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. రాముని స్ఫూర్తితో రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని ఏలూరు జిల్లా పోలవరంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈరోజు పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఏలూరులోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్‌తో కలిసి గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గవర్నర్ పర్యటనలో భాగంగా

పోలవరం ప్రాజెక్ట్ పనులను పరిశీలించి, పురోగతిపై అధికారులతో చర్చిస్తారని తెలిపారు. అదేవిధంగా, పోలవరం ప్రాజెక్ట్ పనుల పురోగతిని ఫోటో ప్రదర్శన ద్వారా వివరించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

---------------------------

అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అమరావతి నిర్మాణాన్ని 2028 ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను నిన్న పరిశీలించారు. అనంతరం అమరావతిపై మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ ...

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

ప్రభుత్వ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా 12 వేల 760 గ్రామ పంచాయతీల్లో ఈ రోజు నుంచి గ్రామసభలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామసభలో రైతు భరోసా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను అధికారులు వెల్లడించనున్నారు. అలాగే జూన్ 2 నుంచి అమలుకానున్న 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకంతో పాటు, విద్యార్థులకు అందిస్తున్న పోషకాహారం, మధ్యాహ్న భోజన పథకాల విశిష్టతను ప్రజలకు వివరించనున్నారు. ఈ సభల్లో గ్రామ సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా గ్రామ సమస్యలను సమగ్రంగా గుర్తించి వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లును ఆదర్శ నియోజక వర్గంగా మారుస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లులో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన నిన్న పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులకు పలు సూచనలు చేశారు. అభివృద్ధి పనుల కోసం నిధులను సమీకరిస్తూనే త్వరితగతిన పూర్తయ్యేలా ఎప్పటికప్పుడు పనులను పరిశీలిస్తున్నామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర అందేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మొక్కజొన్న ధరల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారు నష్టపోకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి స్పష్టం చేశారు. అదనపు సహాయం, నిధుల కోసం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపుల ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. అధిక ఉత్పత్తి వ్యయాలు, అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో మార్కెట్‌లో కొన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ, రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అవసరమైతే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వ కొనుగోళ్లు చేపడతామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లు.. లోక్‌సభలో ఆమోదం పొందడాన్ని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అభినందనలు తెలిపారు. విభజన చట్టంలో పొందుపరిచిన బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి తెలంగాణకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

----------------------------

తెలంగాణలో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేలా రూపొందించిన 'ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్'ను ఈ రోజు నుంచి అందుబాటులోకి తెస్తున్నామని ంవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కేరళ పర్యటనలో ఉన్న మంత్రి పోర్టల్ ప్రారంభానికి సంబంధించిన ఏర్పాట్లపై నిన్న రెవెన్యూ అధికారులతో శ్రవణ మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... రెవెన్యూ శాఖలో సంస్కరణలలో భాగంగా రైతులకు పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడానికి ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే పోర్టల్ కిందకు తెచ్చామని చెప్పారు. ఈ రోజు నుంచి రాష్ట్రంలోని కూసుమంచి, అశ్వారావుపేట, ఆమన్‌గల్, వట్‌పల్లి, కోస్గి వంటి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా భూభారతి పోర్టల్ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

----------------------------

కోస్తాంధ్ర దాని అనుకొని ఉన్న తెలంగాణపై ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న మూడురోజులపాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది.

తెలంగాణాలోనూ రానున్న మూడురోజులపాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది.

======================